

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి హారతులు పడుతున్న మహిళలు

నా విజయం పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అంకితం

బర్కత్‌పుర, జూన్ 21(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా రెండోసారి సాధించిన విజయాన్ని పార్టీ కార్యకర్తలకు ప్రజలకు అంకితం చేస్తున్నానని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా కార్యకర్తలు అంకితభావంతో తన గెలుపునకు పని చేశారని, ప్రజలు కూడా అదేస్ఫూర్తితో తనకు ఓట్లేసి గెలిపించారన్నారు. శుక్రవారం రాత్రి బర్కత్‌పురలోని నగర పార్టీ కార్యాలయంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా కార్యాలయానికి రావడంతో మహిళా కార్యకర్తలు మంగళ హారతులతో కిషన్‌రెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలు మరొకసారి మెజార్టీ అందించి విజయంలో ప్రధానపాత్ర పోషించారన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ప్రేమ్‌సింగ్ రాథోడ్, మాజీమంత్రి కృష్ణయాదవ్, పలువురు బీజేపీ నాయకలు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగుల పింఛన్ పెంచుతామని
మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి: మందకృష్ణ మాదిగ

బర్కత్‌పుర, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగుల పింఛన్ పెంచుతామని మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం తప్పదని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ హెచ్చరించారు. పింఛన్ల అమలులో ఏపీ సీఎం చంద్రబాబు మొదటిస్థానంలో ఉండగా మాజీ సీఎం కేసీఆర్ రెండో స్థానంలో ఉన్నారని, వారిని చూసి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని ఆయన హితవుపలికారు. పింఛన్లను పెంచకపోతే ఈ నెల 25న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశంలో దివ్యాంగులను కలుపుకుని కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజు దివ్యాంగురాలు రజనీకి ఉద్యోగం ఇస్తున్నట్లు ప్రకటించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నేతలు ఎల్.గోపాల్‌రావు, రాంబాబు, భవానీ చౌదరి, జంగయ్య, మంగమ్మ, రజిత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వ రంగ సంస్థగా ప్రకటించాలి

- ఎస్‌డబ్ల్యూయూ ఐఎన్‌టీయూసీ నాయకులు

హైదరాబాద్ సిటీ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్ ఆర్టీసీని ప్రభుత్వ రంగ సంస్థగా ప్రకటించాలని, దీనికోసం ఈ బడ్జెట్ సమావేశాల్లో ఒక నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని ఎస్‌డబ్ల్యూయూ ఐఎన్‌టీయూసీ నాయకులు సయ్యద్ మహమూద్, వైడీ బిన్ సుశీల్ జి.అబ్రహాం డిమాండ్ చేశారు. పదేళ్లలో ప్రజా అవసరాలకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచలేదన్నారు. 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు అందుబాటులోకి తేకపోవడంతో గ్రేటర్‌లో బస్సుల కొరత ఏర్పడిందన్నారు. గత పదేళ్లుగా రిటైరవుతున్న ఉద్యోగులు పీఎఎఫ్ ఖాతా ఫండ్‌ను రిటైరయిన రోజునే ఉద్యోగులకు చెల్లించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా అందుబాటులోకి తెచ్చిన మహాలక్ష్మి ఉచిత ప్రయాణాలకు సంబంధించిన నిధులు ప్రతినెలా కేటాయించడంతోపాటు బడ్జెట్‌లో ఆర్టీసీ బలోపేతానికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు మూడు దఫాలుగా చేయాల్సిన వేతన సవరణను ఇంతవరకు చేయలేదన్నారు. గతపదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజారవాణా సంస్థ వ్యతిరేక విధానాల వల్ల ఏర్పడిన ఆర్థిక సంక్షోభం నుంచి ఆర్టీసీని ఆదుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇంజనీరింగ్ కాలేజీల్లో అక్రమ అడ్మిషన్లను అడ్డుకోవాలి

- ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి వినతి

నల్లకుంట, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీలలో జరుగుతున్న అక్రమ అడ్మిషన్ల ప్రక్రియను అడ్డుకోవాలని టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు అచ్యుత రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని ఆయన కార్యాలయంలో కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పలు ఇంజనీరింగ్ కాలేజీలలో అధిక మొత్తంలో డొనేషన్లు తీసుకుని మేనేజ్‌మెంట్ కోటా సీట్లను ముందే అమ్మేసుకుంటున్నారని ఆరోపించారు. స్పందించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారన్నారయూఊ

యూపీఎస్‌సీ ర్యాంకర్ల ద్వారా సుకన్యసమృద్ధి ఖాతాలు' స్ఫూర్తి'

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) యూపీఎస్‌సీ-2024 ర్యాంకర్ల సమక్షంలో నిరుపేద ఆడపిల్లల అభ్యున్నతికి 'స్ఫూర్తి' పేరుతో కొత్తగా సుకన్య సమృద్ధి ఖాతాలు తెరవడానికి ఏర్పాట్లు చేసినట్టు తపాలాశాఖ సీనియర్ సూపరింటెండెంట్ తెలియజేశారు. యూపీఎస్‌సీ ర్యాంకర్లు వందమంది నిరుపేద ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి ఖాతాలను శనివారం జామైఉస్మానియా పోస్టాఫీస్‌లో తెలంగాణ సర్కిల్ హెడ్ క్వార్టర్స్ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ టీఎం.శ్రీలత ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆడపిల్లల తల్లి/తండ్రి/సంరక్షకులకు ఐపీపీబీ ఖాతాసైతం తెరవనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో 40 మంది యూపీఎస్‌సీ-సీఎస్‌ఈ 2024 ర్యాంకర్లు పాల్గొంటారని తెలిపారు.



ముషీరాబాద్‌లో యోగసనాలు వేస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, బీజేపీ నాయకులు



పీపుల్స్ పార్క్‌లో యోగా చేస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, రత్నసాయిచంద్



ఇందిరాపార్కులో యోగా చేస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి

ఆరోగ్యానికి యోగా

- ఘనంగా అంతర్జాతీయ యోగా వేడుకలు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, పార్కులలో యోగా డే వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. శుక్రవారం ఇందిరాపార్కులో జరిగిన యోగా వేడుకల్లో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏ.సుధాకర్ యాదవ్ కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ, చెన్నారెడ్డినగర్‌లో బీజేపీ నేతలు పాల్గొన్నారు. అంబర్‌పేట సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో రాచకొండ సీపీ తరుణ్‌జోషి, రాణిగంజ్‌లోని గుజరాతి హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్(హైదరాబాద్), రాంకీ ఫౌండేషన్, కిమ్స్ ఫౌండేషన్, పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన యోగా వేడుకలలో అంబర్‌పేట పోలీస్ అకాడమీలో ట్రైనింగ్ కళాశాల డీసీపీ పోలీసు పరావస్తు మధుకర్ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా మనిషి ఆరోగ్యానికి ఎంతోమేలు అని, ఒంటికి యోగా మంచిదేగా అని అన్నారు. ముషీరాబాద్‌లో కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో, యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. చిక్కడపల్లి పీపుల్స్ పార్క్‌లో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగా గురువులు శ్రీనివాస్, సత్తిరెడ్డి బోధనలో కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ తదితరులు యోగాసనాలు వేశారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను పలువురు యోగా గురువులు ఈ సందర్భంగా వివరించారు.

- (ముషీరాబాద్- అంబర్‌పేట జోన్ బృందం)



మదర్స్ ఇంటిగ్రెల్ హైస్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు



డీడీ కాలనీలో యోగా వేడుకల్లో మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి, బీజేపీ నాయకులు



ఛేనెంబర్ శంకర్‌నగర్‌లోని పాఠశాలలో యోగా చేస్తున్న యువతీ యువకులు



చెన్నారెడ్డినగర్‌లో యోగా చేస్తున్న బీజేపీ నేతలు వెంకటస్వామిగౌడ్, రాజు, భిక్షపతి తదితరులు



చిక్కడపల్లి సెయింట్ అడమ్స్ హైస్కూల్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో విద్యార్థులు

పెళ్లి చేసుకుంటానని అత్యాచారం

- యువకుడిపై పోక్సో కేసు, అరెస్ట్

బర్కత్‌పుర, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మోసం చేసి యువతిపై అత్యాచారానికి పాల్పడిన ప్రైవేట్ ఉద్యోగిపై కాచిగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నామాకు చెందిన విశాల్ లక్డీకాపుల్‌లో నివాసం ఉంటున్న ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై అత్యాచారం చేశాడు. అనంతరం మరో యువతిని వివాహం చేసుకున్నాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి శుక్రవారం నిందితుడు విశాల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

యువతి బాత్రూమ్‌లో స్నానం చేస్తుండగా

- సెల్‌ఫోన్‌లో వీడియో తీసిన వ్యక్తి అరెస్ట్

బర్కత్‌పుర, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): యువతి బాత్రూమ్‌లో స్నానం చేస్తుండగా దొంగచాటుగా సెల్‌ఫోన్ వీడియో తీసిన వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గాంధీనగర్ లంకలో నివాసం ఉంటున్న 25 ఏళ్ల యువతి తన ఇంట్లో బాత్రూమ్‌లో స్నానం చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన జెల్‌ఫేస్ (24) దొంగచాటుగా వీడియో తీస్తున్నాడు. గమనించిన యువతి అతనితో గొడవపడి కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అజంతా, చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో చోరీ

- ప్రయాణికుల బంగారు ఆభరణాలు మాయం

బర్కత్‌పుర, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): అజంతా, చెంగల్పట్టు రైళ్లలో చోరీ జరిగింది. ప్రయాణికులు బ్యాగుల్లోని బంగారు ఆభరణాలను మాయం చేశారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌కు చెందిన లలితశ్రీ నాగర్ సోల్‌లో అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. నిజామాబాద్ వద్ద బ్యాగు కనిపించలేదు. బ్యాగులో పది తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. నగరానికి చెందిన మానస పుత్తూరు నుంచి చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తుంది. గుత్తి వద్ద ఆమె బ్యాగు కనిపించలేదు. బ్యాగులో రెండు తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. దాంతో బాధితులు శుక్రవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పైడి లక్ష్మయ్య, సంజీవరెడ్డి పురస్కారాల ప్రదానం 24న

చిక్కడపల్లి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పైడి లక్ష్మయ్య, వారి కుమారుడు పైడి సంజీవరెడ్డి పేరిట స్మారక పురస్కారాలు ఈనెల 24న త్యాగరాయగానసభలో పైడి లక్ష్మయ్య ట్రస్ట్, రసమయి సంస్థ ఆధ్వర్యంలో ప్రదానం చేస్తామని రసమయి నిర్వాహకుడు ఎంకె రాము తెలిపారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ పాల్గొని వీణాకళాకారిణి ఈమని కల్యాణి, సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, సాహితీవేత్త వీడీ రాజగోపాల్, ఆధ్యాత్మికవేత్త జగదీష్ బాబుకు పురస్కారాలు ప్రదానం చేస్తారని తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో నరసింహప్ప, డా. నారాయణ తదితరులు పాల్గొంటారన్నారు.

సెప్టెంబర్ 9న చలో హైదరాబాద్

రాంనగర్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన ఎస్టీలకు రిజర్వేషన్లు, ఏజెన్సీ ప్రాంతాల్లో 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సెప్టెంబర్ 9న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ వెల్లడించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్టీలకు రాజ్యాంగపరంగా రావాల్సిన 10శాతం రిజర్వేషన్లను రద్దు చేయడం అన్యాయమన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 100 శాతం ఉద్యోగ కల్పనకై ఉన్న జీవోను రద్దు చేసిందని, దీంతో ఎస్టీలకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయన్నారు. జీవో నెంబర్ 33 ద్వారా ఎస్టీలకు లభించే 10శాతం రిజర్వేషన్లను అడ్డుకోవాలని కొంత మంది కోర్టులో కేసులు వేశారని ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సేవాలాల్‌సేన వ్యవస్థాపకులు రమేష్‌మహరాజ్ నాయక్, సైదానాయక్, వెంకన్ననాయక్, హంస్సేన్‌నాయక్, కల్యాణ్‌నాయక్, భాస్కర్‌నాయక్, ఓబన్న నాయక్, ప్రవీణ్‌నాయక్ పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్ సమస్య పరిష్కారానికి కృషి

- బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ

రాంనగర్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని మేడిబావి బస్తీ జెమిస్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద ప్రైవేట్ వాహనాల అక్రమంగా కొనసాగుతున్న పార్కింగ్ సమస్యను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ట్రాఫిక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు చేపడతామని బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ తెలిపారు. శుక్రవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వి. సుధాకర్‌గుప్తా ఆధ్వర్యంలో పాదయాత్ర చేసి పాఠశాల వద్ద నెలకొన్న సమస్యను పరిశీలించారు. జైసింహ ముఖ్యఅతిథిగా హాజరై అక్కడ నెలకొన్న వాహనాల పార్కింగ్ సమస్య చెత్త, మట్టికుప్పల వ్యర్థాలను పరిశీలించారు. సమస్యను సంబంధిత విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, ఎం.డి. ఖదీర్, లింగంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు సమాంతరంగా నాలా స్లాబ్ వేయాలి

- డీఎంసీకి బీజేపీ నాయకుల వినతిపత్రం

అంబర్‌పేట, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లోని సీపీఎల్ నాలా స్లాబ్‌ను రోడ్డుకు సమాంతరంగా వేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్ కోరారు. శుక్రవారం అబిడ్స్‌లోని సర్కిల్ కార్యాలయంలో అంబర్‌పేట సర్కిల్ 16 డీఎంసీ మారుతిదివాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రేమ్‌నగర్ గ్రీన్‌ల్యాండ్ హోటల్ వద్ద నిర్మించిన కాల్వ మ్యాన్‌హోల్, దానిపై వేసిన స్లాబ్ ఎత్తులో ఉందని డీఎంసీకి వివరించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు షైలారం రాజు, మాణిక్‌ప్రభు ముదిరాజ్, శ్యామ్‌రాజ్, యాదగిరి, తిరుపతిగుప్తా, భాస్కర్‌గౌడ్, మనోజ్ తదితరులు ఉన్నారు.

వైద్యరంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని నేటి యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జార్జ్‌టెలీగ్రామ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ దాజు, లిండే ఆక్సిజన్ సంస్థ ప్రతినిధి అనురాధ సూచించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్)లో భాగంగా అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన లిండే ఆక్సిజన్ సంస్థ, జార్జ్‌టెలీగ్రామ్ సంస్థల ఆధ్వర్యంలో రాంనగర్‌లోని సాధన పారామెడికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు 'పేషెంట్స్‌తో రిలేషన్‌షిప్' అంశంపై మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సంజీవకుమార్‌దాస్, అనురాధ సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ ఇండియాలోని అంశాలపై శిక్షణ పొంది... యువత ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో అభిషేక్, సిరాజుద్దీన్, జహీర్ పాల్గొన్నారు.



సర్టిఫికేట్లు అందుకున్న విద్యార్థులతో సంజీవ్‌కుమార్, అనురాధ



జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గోపాల్, జైసింహ, రాకేష్ తదితరులు



రాంనగర్ చౌరస్తాలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సయ్య

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. జయశంకర్ వర్ధంతిని అంబర్‌పేట, ముషీరాబాద్ నియోకవర్గాలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. పలుప్రాంతాల్లో జయశంకర్ విగ్రహాలకు, చిత్రపట్లాకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శనివారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ చౌరస్తాలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, రాకేష్‌కుమార్, నరేష్, పున్న సత్యనారాయణ.. విద్యానగర్‌లో బీఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ ప్రధానకార్యదర్శి కె. సురేందర్, అనురాధ తదితరులు నివాళులర్పించారు. అశోక్‌నగర్‌లో తెలంగాణ న్యాయవాదులు జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాంనగర్ చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద జయశంకర్ చిత్రపటానికి టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నర్సయ్య పూలమాలలువేసి నివాళులర్పించారు. నింబోలిఅడ్డాలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో బీఆర్‌టీయూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు పోలే నిరంజన్, బీఆర్ఎస్ నాయకుడు జి అనిల్‌కుమార్‌యాదవ్ విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్‌లను పంపిణీ చేశారు.

-(ముషీరాబాద్-అంబర్‌పేట జోన్ బృందం)



విద్యానగర్‌లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అడిక్‌మెట్ బీఆర్ఎస్ నాయకులు



బాపూజీనగర్‌లో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయులు

అసెంబ్లీ హాల్‌లో ప్రొఫెసర్ జయశంర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

ముషీరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అలుపెరుగని పోరాటం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని అసెంబ్లీహాల్‌లో, ధర్నాచౌక్ వద్ద 121 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వేములవాడ మదన్‌మోహన్ డిమాండ్ చేశారు. జయశంకర్ 13వ వర్ధంతిని గ్రేటర్ హైదరాబాద్ మనుమయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముషీరాబాద్‌లోని బాపూజీ నగర్‌లో ఉన్న ప్రొ. జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రైవేట్‌కు దీటుగా
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదివి, పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం ఎమ్మెల్యే బహుమతులు అందజేసి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల అధ్యాపకులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో విజయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుశీలమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలకు అండగా 'కల్యాణలక్ష్మి'

నల్లకుంట, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడపిల్లలకు 'కల్యాణలక్ష్మి' పథకం అండగా నిలుస్తుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేర్ వెంకటేష్ పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి వంటి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఆయన అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన 14 మందికి హిమాయత్‌నగర్ మండల కార్యాలయంలో తహసీల్దార్ సంధ్యతో కలిసి ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రఘువిష్ణు పాల్గొన్నారు.

బీజేపీనగర కార్యవర్గసభ్యుడు
చంద్రశేఖర్‌కు మాతృవియోగం

కవాడిగూడ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నగర కార్య వర్గసభ్యుడు భువనగిరి చంద్రశేఖర్‌కు మాతృవియోగం కలిగినది. ఆయన తల్లి వెంకటలక్ష్మమ్మ(92) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందారు. ఆమె అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో కుటుంబసభ్యులు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, బీజేపీ నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, సీహెచ్ శ్రీనివాస్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకుడు కాటారం దినేష్, మృతదేహంపై పుష్పగుచ్చాలు పెట్టి నివాళులర్పించారు.